
## ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



# దరిద్రపుగొట్టు కాంగ్రెస్ పాలనొద్దు..

- వారి హయాంలో పొలాలు, చేల వద్దే జాగారాలు
- కళ్ల ముందు ఎండిపోయిన పంటలు మళ్లీ గుర్తుకొస్తున్నాయి
- మూడు గంటల కరెంటుతో పొలాలు ఎండుడు ఖాయం
- 10హెచ్‌పీ మోటర్లు సన్న, చిన్నకారు రైతులు కొనలేరు
- సీఎం కేసీఆర్ ఇస్తున్న 24 గంటల విద్యుత్‌తో రెండు పంటలు
- ధరణి పోర్టల్ తోనే భూములకు పూర్తి భద్రత
- బీఆర్‌ఎస్‌కే మా మద్దతు అంటున్న ఉమ్మడి జిల్లా రైతాంగం



మూడు గంటల కరెంటుతో రైతులు పంటలు పండించుకోవచ్చు. 10హెచ్‌పీ మోటర్లతో నీరు పారించుకోవచ్చు. ధరణి పోర్టల్‌ను తొలగించి దాని స్థానంలో భూమాత పోర్టల్‌ను తీసుకొస్తాం. కౌలు రైతుల కాలం పెడతాం. పటేల్, పట్వారీ వ్యవస్థను తెస్తాం.. అంటూ కాంగ్రెస్ నాయకులు చెబుతున్న మాటలపై ఉమ్మడి జిల్లా రైతాంగం భగ్గుమంటున్నది. గత పాలనలోనే కరెంటు లేక.. నీళ్లు రాక.. పంటలు పండక సతమతమైతే.. మళ్లీ పాత పాట పాడడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పటేల్, పట్వారీ వ్యవస్థతో కార్యాలయాల చుట్టూ తిరగలేక నానా అవస్థలు పడ్డాం. దళారుల ప్రమేయంతో తీవ్రంగా నష్టపోయాం. మళ్లీ ఆ విధానం వద్దని కరాఖండిగా రైతాంగం చెబుతోంది. సీఎం కేసీఆర్ పాలనలో పదేళ్లుగా నిరంతరాయంగా అందించే 24 గంటల విద్యుత్‌తో రెండు పంటలు పండించుకుంటున్నాం. చెరువుల్లో పుష్కలంగా ఉన్న నీటిని పంటలకు వినియోగించుకుంటున్నాం. ధరణి పోర్టల్‌తో ఎలాంటి సమస్యలు తలెత్తడం లేదు. తహసీల్దార్ కార్యాలయాల్లో గంటల వ్యవధిలోనే రిజిస్ట్రేషన్లు, దళారుల ప్రమేయం లేకుండా పట్టాదారు పాస్ పుస్తకాలు అందుతున్నాయి. భూములకు భద్రతతోపాటు మంచి ధర పలుకుతున్నాయి. ఎన్నికల సమయంలో పూటకో మాట.. గడియకో విధానాన్ని ప్రకటించే కాంగ్రెస్ నాయకుల మాటలు ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మం. దరిద్రపుగొట్టు కాంగ్రెస్‌ను దరిదాపుల్లోకి రానివ్వమంటున్నారు. రైతుల శ్రేయస్సు గురించి ఆలోచించి.. వివిధ పథకాలతో ఆదుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్ పక్షానే నిలబడతాం. బీఆర్‌ఎస్‌ను మళ్లీ అధికారంలోకి తెచ్చేందుకు మా బాధ్యతగా ఓటు వేస్తామని సాగు రైతులు ముక్తకంఠంతో చెబుతున్నారు.

*- భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ )*

### కాంగ్రెస్ పాలనలో రైతులు అథోగతి పాలయ్యారు



గత దశాబ్దాలుగా సాగిన కాంగ్రెస్ పాలనలో రైతులు అథోగతి పాలయ్యారు. ఎంతోమంది ఆత్మహత్యలు చేసుకున్నారు. భూములకు సరైన రక్షణే ఉండేది కాదు. ఉద్యమనేత కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక రైతులపైన ప్రత్యేక దృష్టి పెట్టారు. వారి భూములను కాపాడేందుకు ధరణి తీసుకొచ్చారు. ఎవరు భూమి వాళ్ల బొటనవేలు ముద్రతోనే అనుసంధానం అయ్యేలాగా తీర్చిదిద్దారు. వాళ్లు ముద్ర వేస్తేనే భూమిని అమ్మడం కానీ, కొనడం కానీ జరుగుతుంది. అరగంటలోనే రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉంది. 15రోజుల్లో పాస్‌బుక్ ఇంటికొచ్చి చేరుతుంది. దీంతో రైతుబంధు వస్తుంది. రైతులకు ధాన్యం కొనుగోలుకు అవకాశం ఉంటుంది. సన్నకారు రైతులకు, చిన్నకారు రైతులకు ఎంతో సౌలభ్యమైంది. ధరణి పోర్టల్. దీన్ని తీసేస్తామని, దీని స్థానంలో భూమాతను తీసుకొస్తామని కాంగ్రెస్ వాళ్లు ప్రకటించారు. వాళ్లు కనుక గెలిస్తే ధరణిని తీసేయడం ఖాయం. మళ్లీ రైతు బతుకు బజారున పడుతుంది. అందుకే కేసీఆర్‌కు రైతులంతా ఓట్లు వేసి గెలిపించాలి.

**– లావుడ్యా సత్యనారాయణ, సీతంపేటబంజర**

### కేసీఆర్ ఉండగ మాకేంకాదు



కేంద్రం రైతుల కరెంటు మోటర్లకు మీటర్లు పెడితేనే నిధులు ఇస్తామని, లేదంటే ఇవ్వమని చెప్పిన కేసీఆర్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేసింది. కేంద్రం నిధులు ఇవ్వకున్నా పర్వాలేదు.. రైతులను మాత్రం ఇబ్బంది పెట్టమని కేసీఆర్ కరాకండిగా చెప్పి రైతులను ఆదుకున్నారు. అలాంటి వ్యక్తి ఉండగా మా రైతులకు ఏమవుతుంది. 24గంటల విద్యుత్‌తో రైతులు ఉత్సాహంగా సాగు చేసుకుంటున్నారు. కాంగ్రెసోళ్లు మూడు గంటలు కరెంటు ఇస్తామని చెబుతున్నారు... ఆ కరెంటు రైతు పొలాలకు ఒక్క మడికైనా సరిపోతుందా... వ్యవసాయం తెలియని వాళ్లు మాట్లాడితే ఇలాగే ఉంటది. కాంగ్రెస్ పాలనలో రైతులకు చీకటిరోజులు. కేసీఆర్ వచ్చాకే రైతు రాజయ్యాడు. వ్యవసాయం దండగ నుంచి పండగ చేశారు. బీఆర్‌ఎస్‌కే మా మద్దతు. కాంగ్రెస్ వద్దు... ఆ మూడు గంటల కరెంటు వద్దు.

**– సోడి తిరుపతిరావు, రైతు, నడికుడి, దుమ్ముగూడెం**

### ధరణితోనే భూములకు రక్షణ



ధరణి ఉండబట్టే రైతుల భూముల పక్కాగా ఉన్నాయి. పాత వ్యవస్థను తీసుకు రావడమంటే.. మళ్లీ పట్వారీ వ్యవస్థను ఆహ్వానించడమే. ఒక రైతు భూములను మరో రైతు పేరిట రాసి కొట్లాటలు పెట్టడమే. ఇలా మళ్లీ రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తుంది. కాంగ్రెస్ హయంలో రైతుల మధ్య గొడవలు ఉండేవి. మళ్లీ అవి పునరావృతమవుతాయి. మా ఓటు కేసీఆర్ సారుకు మాత్రమే వేస్తాం. ముచ్చటగా మూడోసారి కేసీఆర్ సారు రావాలి.

**– కొడెం నరసింహారావు, రైతు, బెండాలపాడు గ్రామం, చండ్రుగొండ మండలం**

### ధరణి తీసేస్తే దోపిడే



కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణిని తీసేస్తరట.. అదిగానీ జరిగితే మళ్లీ దళారీ రాజ్యం వస్తది. రికార్డుల్లో భూముల వివరాలను ఇష్టమొచ్చినట్లుగా నమోదు చేస్తారు. భూతగాదాలు ఎక్కువవుతాయి. ధరణి వచ్చినంక రైతులకు భరోసా కలిగింది. భూ రికార్డులు భద్రంగా ఉన్నాయి. రైతుబంధు వస్తున్నది. పొరపాటున కూడా కాంగ్రెస్‌కు ఓటెయ్యం. రైతులకు మేలు చేసే బీఆర్‌ఎస్‌కే మా మద్దతు.

**– మర్మం బాలరాజు, రైతు, అడవిరామవరం, దుమ్ముగూడెం**

### కరెంటు కష్టాలు పూర్తిగా తీరాయి



కేసీఆర్ పాలనలో రైతులకు కరెంటు కష్టాలు పూర్తిగా తీరాయి. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చారు. పంటలు చక్కగా పండుతున్నాయి. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వమే కొంటున్నది. కాంగ్రెస్ వస్తే మళ్లీ మాకు కష్టాలు తప్పవు. మూడు గంటల కరెంటుతో పంటలు ఎండిపోతాయి. నష్టాలు వచ్చి రైతులు మళ్లీ ఆత్మహత్యలు చేసుకోవడమే. కేసీఆర్ సారుకే ఓటు వేస్తాం. మళ్లీ ఆయనే రావాలి.

**– షేక్ రసూల్, రైతు, తిప్పనపల్లి గ్రామం, చండ్రుగొండ మండలం**

### జనరేటర్ జాడే లేదు..



ఒకప్పుడు కరెంటు లేక అనేక పరిశ్రమలు, ఆస్పత్రులు జనరేటర్‌ను వాడుకుంటూ రోగులు, కొనుగోలుదారులపై అధిక భారం వేస్తూ సంపాదించుకునేవారు. గత పాలకుల హయాంలో డీజిల్, పెట్రోల్ రేట్లు బాగా పెరిగిపోయేవి. కానీ నేడు 24 గంటల కరెంట్‌లో జనరేటర్ జాడే లేకుండా పోయింది. నిరంతర విద్యుత్‌తో డీజిల్, పెట్రోల్ బాధలు తప్పాయి. కరెంటు పోతే పేదోళ్లు కటిక చీకట్లో మగ్గేవారు. నేడు ధనిక, పేద తేడా పోయింది. అందరి ఇంట్లో కరెంటు ఉంది. ఇదంతా కేవలం సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమైంది. అందుకే మళ్లీ సారే సీఎం కావాలి

**– తాటి ముత్తయ్య, చల్లసముద్రం పంచాయతీ, వేములవాడ గ్రామం, ఇల్లెందు మండలం**

### దళారుల రాజ్యం వస్తుంది



ధరణిని రద్దు చేసి పాత పటేల్, పట్వారీ వ్యవస్థ తెస్తమని కాంగ్రెసోళ్లు అంటున్నారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో భూమి సమస్యలపై వీఆర్వోలు, తహసీల్దార్ల చుట్టూ తిరిగాం. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్ తెచ్చాక రైతులకు ఈ బాధలు తప్పాయి. భూమి రికార్డులు భద్రంగా ఉన్నాయి. ఇప్పుడు రైతులు ప్రశాంతంగా ఉంటున్నారు. ధరణి రద్దు చేసి, భూమాత తెస్తే.. రైతులంతా ఆగమైతరు. భూ సమస్యలు మళ్లీ మొదటికొస్తాయి. రైతులకు గోస తప్ప మరేం ఉండదు. కాంగ్రెస్ తెచ్చే భూమాత వద్దు. ధరణి ఉండటమే మంచిది. కేసీఆర్ ప్రభుత్వమే మళ్లీ రావాలి. మా ఓటు బీఆర్‌ఎస్‌కే.

**– బొల్లు రవి, రైతు, బూర్గంపహాడ్**

### భూమాత వద్దే వద్దు...



కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే భూమాతను తెస్తారంటా!. మాకు ధరణే బాగుంది. ధరణిని తీసేస్తే మళ్లీ రెవెన్యూ అధికారులకు అమ్యామ్యాలు పెట్టాలి. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ధరణి ద్వారా రైతు భూములను నమోదు చేసి, రైతుల ఖాతాల్లో రైతుబంధు వేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభు త్వం హాయాంలో డబ్బు, పలుకుబడి ఉన్నడోదే రాజ్యం. రికార్డుల్లో వారికి నచ్చిన భూమిని రెవెన్యూల అధికారులకు సొమ్ములిచ్చి వారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేసుకోనేటోళ్లు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కర్ణాటకలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలుకావడం లేదు. ముఖ్యమంత్రి కుర్చీ కోసం కొట్లాడుకుంటున్నారు. కాంగ్రెస్ వద్దే వద్దు.

**– మందా నాగేశ్వరరావు, చిన్న బండిరేవు, దుమ్ముగూడెం**

### ధరణి వల్ల మా భూములకు భద్రత పెరిగింది



ధరణి వల్ల ఎంతో ఉపయోగం ఉంది. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల భూమి భద్రత కోసం ధరణి ఏర్పాటు చేశారు. ధరణి వల్ల మా భూములకు భద్రత పెరిగింది. రైతుబంధు, రైతుబీమా మాకు వర్తిస్తున్నాయి. మా తండ్రి చనిపోయిన తర్వాత రూ.5 లక్షల రైతుబీమా ప్రభుత్వం ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం మాటల నమ్మి మోసపోయే పరిస్థితిలో మేము లేము. కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారు. మళ్లీ మేం కారు గుర్తుకే ఓట్లు వేస్తాము.

**– దాసరి రాములు, పల్లిపాడు, వైరా**

### రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్



దేశంలోనే రైతులకు 24 గంటలు ఉచితంగా విద్యుత్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణనే. తెలంగాణ ఏర్పాటు సమయంలో రాష్ట్రం మొత్తం తిరిగి రైతుల సాదక, బాధలను తెలుసుకున్న కేసీఆర్ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన తర్వాత సీఎంగా కేసీఆర్ వచ్చాక రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తున్నారు. వ్యవసాయానికి 24గంటల ఉచిత కరెంట్ దేశంలో ఏ రాష్ట్రంలో లేదు. రైతులకు అండగా ముఖ్యమంత్రి కేసీఆర్ నిలిచారు. రైతులకు పెట్టుబడి సహాయం, రైతుబంధు, రైతు బీమా తదితర సంక్షేమ పథకలు ప్రవేశపెట్టిన ఘనత కేసీఆర్‌దే. సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్‌కు అండగా నిలిచి కారు గుర్తుకు ఓటెస్తాం.

**– భూక్యా ఇందిర, పాతతండా గ్రామం, రాంపురం గ్రామపంచాయతీ, టేకులపల్లి మండలం**

### ధరణితో ఎంతో మేలు



ధరణితో రైతులకు ఎంతో మేలు జరుగుతున్నది. ధరణితో మా భూముల వివరాలు ఆన్‌లైన్‌లో కనిపిస్తున్నాయి. ధరణి లేనప్పుడు.. మా ఊరిలోనే ఒకరి భూములు మరొకరి పేరు మీద మారిపోయేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఎవరి పేరు మీద భూమి ఉన్నదో వారే తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి, బయోమెట్రిక్ ద్వారా వేలి ముద్ర వేస్తేనే వేరే వాళ్ల పేరు మీదకు భూమి మారుతుంది. మా భూములకు ఇంత కన్నా రక్షణ ఎక్కడా ఉండదు. కేసీఆరే మళ్లీ సీఎం కావాలని రైతులంతా కోరుకుంటున్నారు. కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్‌ను గెలిపించుకుంటాం.

**– సమ్మయ్య, గుట్టమల్లారం, మణుగూరు మండలం**

### ప్రజా కోర్టులో ఓటమి తీర్పు తప్పదు



మా కుటుంబమంతా బీఆర్‌ఎస్‌కే ఓటు వేస్తాం. ఏనాడు తెలంగాణ రాష్ట్రం గురించి పట్టించుకోని వారు ముఖాలకు రంగులు అద్దుకుని ప్రజల ముందుకు వచ్చి ఇది చేస్తాం.. అది చేస్తామంటే నమ్మే పరిస్థితుల్లో లేము. బ్రహ్మాండమై పథకాలు, అభివృద్ధి జరిగింది కేవలం సీఎం కేసీఆర్ హయాంలోనే. వీళ్లకి అధికారి ఇచ్చి రాష్ట్రాన్ని 50 ఏళ్ల పాటు వెనక్కి నెట్టలేము. మా బతుకులు సగం అయిపోయినాయి. మా పిలగాండ్ల భవిష్యత్తు చూడాలే. ఏమీ దొరకకపోతే కరెంటు, ధరణిని పట్టుకుని లాగుతుండ్రు. అసలు తెలిసి మాట్లాడుతున్నారా.. లేక మతిభ్రమించి మాట్లాడుతున్నారా అనేదే గమ్మత్తుగా ఉంది. హస్తానికి ప్రజాకోర్టులో ఓటమి తీర్పునిస్తాం.

**– వూకం సమ్మయ్య, మొండితోగు పంచాయతీ, ధర్మాపురం గ్రామం, ఇల్లెందు మండలం**

### కాంగ్రెస్ వస్తే మళ్లీ కరెంట్ కోతలే



తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నది. దానివల్ల రైతులకు పంటలు బాగా పండుతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పరిపాలన చేసే రోజుల్లో కరెంట్ కోతలు ఎక్కువగా ఉండేవి. మరలా కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో వస్తే రైతులకు మూడు గంటల ఉచిత విద్యుత్ మాత్రమే ఇస్తానని అంటున్నారు. పొలాలు ఎండిపోతాయని, మరలా తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రావాలి.

**–ఇన్నపల్లి తిరుపతయ్య, జన్నారం, ఏన్కూరు**

### కేసీఆర్‌తోనే రాష్ట్రం అభివృద్ధి చెందింది



తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందింది. రైతుల కోసం ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ వల్ల రైతులకు ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. రైతుబంధు, రైతుభీమా ధరణి వల్లే సాధ్యం. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ధరణి తీసివేస్తానని అంటున్నారు. ధరణి పోర్టల్ తీసేస్తే రైతులు కష్టాలపాలవుతారు. ధరణి ఉండాలంటే మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వమే రావాలి. కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించుకుంటాం.

**– గొడ్ల వెంకటి, నూకాలంపాడు, ఏన్కూరు**

### రైతు బాంధవుడు కేసీఆర్



కేసీఆర్ రైతు బాంధవుడు, రైతుల కష్టాలు తెలిసినోడు. అందుకే రైతులకు అవసరమైన సాగునీరు, 24గంటల నాణ్యమైన కరెంట్‌తోపాటు రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ లాంటి పథకాలను అమలు చేస్తున్నారు. రైతు ఏ కారణంతోనైనా చనిపోయినా ఖాతాలో రూ.5 లక్షలు వేస్తున్నాడు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఈ పథకాలు ఏమీ ఉండవు. కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి రాకముందే 3గంటలు కరెంట్ చాలంటున్నారు. 24గంటలు కరెంట్ ఉండబట్టే రైతు తనకు అనుకూలమైన సమయంలో పంటలకు తడి పెట్టుకుంటున్నాడు. కాంగ్రెస్ వస్తే అర్ధరాత్రి పూట కరెంట్ ఇస్తుంది. గతంలో ఎంతోమంది రైతులు కరెంట్‌షాక్‌తో, పాములు, తేళ్లు కరవడంతో చనిపోయారు. మళ్లీ అటువంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే బీఆర్‌ఎస్‌కే ఓటు వేసి గెలిపించాలి.

**– సోమయ్య, రైతు, నల్లబల్లి, దుమ్ముగూడెం**

### కాంగ్రెస్‌తో కరెంటు కష్టాలు



కాంగ్రెస్ అంటేనే.. కరెంటు కష్టాలు. కేసీఆర్ పాలనలో రైతులకు బాధలు తప్పాయి. వ్యవసాయానికి 24 గంటల కరెంటు ఇస్తున్నారు. రైతుబంధు, రైతు బీమా ఇస్తున్నారు. కాంగ్రెసోళ్ల పాలనలో కరెంటు కష్టాలతో వ్యవసాయం చేయలేక తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. కాంగ్రెసోళ్లు వచ్చి మూడు గంటల కరెంటు చాలు..10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోండి.. అని చెబుతుంటే నవ్వొస్తున్నది. కాంగ్రెస్ రావొద్దు... ఆ మూడు గంటల కరెంటు అస్సలొద్దు. మాకు కేసీఆరే కావాలి. ఆయనకే మా ఓటు.

**– పాయం భద్రయ్య, రైతు, చింతిర్యాలగూడెం, అశ్వాపురం మండలం**


### ధరణి రద్దు చేస్తే రైతుల భూములు ఆగమాగం



కాంగ్రెస్ నాయకులు ధరణిని రద్దు చేస్తామంటున్నారు. ధరణి రద్దు చేస్తే రైతుల భూములు ఆగమాగమవుతాయి. గతంలో ప్రతి గ్రామంలో భూముల రికార్డుల విషయంలో గొడవలు జరిగేవి. ధరణి వచ్చాక గ్రామీణ ప్రాంతాల్లో రైతుల మధ్య గొడవలు తగ్గాయి. రైతుల గొడవలను సీఎం కేసీఆర్ దృష్టిలో ఉంచుకుని ధరణి తీసుకొచ్చారు. ధరణి పోర్టల్‌లో భూముల వివరాలు ఎక్కిస్తే దానిని మార్చడం వీలుకాదు. రైతుల కోసం ఏర్పాటు చేసిన ధరణి రద్దు చేస్తే రైతులకు మళ్లీ పాతగోసలే మిగులుతాయి. ఈసారి కారు గుర్తుపై ఓటు వేసి కేసీఆర్‌ను మళ్లీ ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రిగా చేస్తాం.

**– దాసరి లింగమల్లు, పడమటిగుంపు గ్రామం, ప్రేగళ్లపాడు గ్రామపంచాయతీ, టేకులపల్లి మండలం**

### మూడు గంటల కరెంటుతో మడి కూడా తడవదు



మూడు గంటల కరెంటుతో వరి మడి ఒక్కటి కూడా తడవదు. సీఎం కేసీఆర్ 24 గంటల కరెంటు ఇవ్వడంతో తడులు పెట్టుకుంటున్నాం. మా కుటుంబం సంతోషంగా ఉంది. 10 హెచ్‌పీ మోటర్ల వల్ల రైతులకు చాలా ఇబ్బందులు ఉంటాయి. కాంగ్రెస్ ప్రభుత్వాలు కరెంటు సక్రమంగా ఇవ్వకపోవడంతో పంటలు ఎప్పుడూ ఎండిపోయేవి. మళ్లీ ఆ సమస్యలు రాకూడదు. అందుకే, కారు గుర్తుకే ఓటు వేస్తాం.

**– జుజ్జూరి రాంబాబు, రైతు తిరుమలకుంట, అశ్వారావుపేట మండలం**

### ధరణి తీసివేస్తే నష్టమే



ధరణి పోర్టల్ తీసివేస్తే రైతులకు తీరని నష్టం జరుగుతుంది. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రైతుల భూములకు రక్షణ లేదు. వీర్వోలు, వీఆర్‌ఏలు ఇష్టం వచ్చినట్లు పేర్లు మార్చేసేవారు. వాళ్ల చేతిలోనే మా భూముల వివరాలు ఉండేవి. ఇదే సాకుగా మా దగ్గరి నుంచి లంచం తీసుకునేవారు. సీఎం కేసీఆర్ వచ్చిన తర్వాత.. రైతుల ఇబ్బందులను చూసి ధరణి తెచ్చారు. ధరణితో మా భూములకు రక్షణ దక్కింది. ధరణిని తీసివేస్తే మా రైతులకు నష్టమే. మేమంతా కారు గుర్తుకే ఓటు వేస్తాం.

**– లక్ష్మి, గుట్టమల్లారం, మణుగూరు మండలం**